# ఆఖరినిర్ణయం

కె. వి. వి. సత్యనారాయణరాజు

'అయ్యగారు పిలుస్తున్నార'నే మాట వినీ వినబడడంతోనే చేతిలోని ఫైల్ మూసేసి, కుర్చీ వెనక్కి జరిపి పరుగులాంటి నడకతో బాస్ ఛాంబర్‌లోకి ప్రవేశించాడు పరమేశ్వర్రావు

అడుగుల చప్పుడు విని తలెత్తి, 'కూర్చోండి". అంటూ తన కెదురుగా ఉన్న కుర్చీ వైపు దృష్టి సారించాడు సురేంద్ర

కానీ పరమేశ్వర్రావు, కూర్చునే ప్రయత్నం చేయకుండా అతడు చెప్పబోయే విషయాన్ని రిసీవ్ చేసుకునేందుకు చెవులు రిక్కించాడు

పరమేశ్వర్రావే కాదు, ఆ ఆఫీస్‌లో పని చేస్తున్న మరే వ్యక్తి కూడా సురేంద్ర ఎదురుగా కూర్చునే ప్రయత్నం చేయడు- ఒక్క స్టెనో గ్రాఫర్ మధుబాల తప్ప ఆమె అయినా కూర్చుంటుందంటే అతడిచ్చే డిక్టేషన్ తీసుకునేందుకు అంతే!

సురేంద్రలో హిపోక్రసీ లేదు తన క్రింది వాళ్ళను మనఃస్ఫూర్తిగానే అతడు కూర్చోమని అంటాడు కానీ ఎవరూ అతడి ఎదురుగా కూర్చునే ప్రయత్నం చేయరు

ఓసారి సెక్షన్ లోకి సురేంద్ర వచ్చినపుడు కాలుస్తున్న సిగరెట్‌ను ఆర్పేసి దాచేయ బోయిన చలపతి దగ్గరకు వెళ్ళి తన జేబులోంచి లైటర్ తీసి వెలిగించి అతడి ఎదురుగా పట్టుకున్నాడు సురేంద్ర

'నువ్వీపని చెయ్యొద్దంటే- 'ఎందుకు చేయ కూడద'నే అహం తలెత్తుతుంది తప్ప, 'నీకిష్టమైన పని నువ్వు చెయ్'-- అన్నపుడు ప్రతివాడూ తన కిష్టం కలిగించే పని ఎదుటి వాడికేమైనా కష్టం కలిగిస్తుందా? అనే ఆలోచిస్తాడు.

ఊహల్లో తప్ప వాస్తవంలో కనబడని ఆఫీస్ వాతావరణం అక్కడ నెలకొంది - సురేంద్రక్కడ చేరినప్పటి నుంచీ

నిత్యమూ కళ్ళెదురుగా తిరిగే వ్యక్తి గురించి ఓ అవగాహనకు వచ్చేందుకు రెండు సంవత్సరాల కాలం తక్కువేమీ కాదు అయినా అతడు పైకి మాట్లాడే మాటలు తప్ప అతడు మనసులో ఏం ఆలోచిస్తూ ఉంటాడో ఎవరికీ అంతు బట్టేదికాదు

ఏ సాయం సమయంలోనూ అతడే బార్‌లోనూ దూరడం ఎవరికంటా బడలేదు అతడి దగ్గర ఎప్పుడూ సిద్ధంగా ఉండే సిగరెట్ పాకెట్, లైటర్ ఎదుటి వారి కోసమే తప్ప అతడి కోసం అతడుపయోగించగా ఎవరూ చూడలేదు ఇరవై ఎనిమిదేళ్ళ వయసతడికి ఉన్నా అతడేనాడు ఆడ దానివైపు వెకిలిగా చూడడం గానీ, చాటుగా సుఖం కొనుక్కునేందుకు గానీ ప్రయత్నించలేదు

ఆ మాట కొస్తే - అదే ఆఫీస్‌లో పని చేస్తున్న భామలిద్దరు- అతడు చేరిన కొత్తల్లో అతడి వైపు అమితంగా ఆకర్షింపబడి తమ నతడాకర్షించేలా చేసేందుకు పాట్లు పడ్డారు తప్ప అతడేనాడూ వారి వైపు ఆకర్షింప బడినట్టుగా బయట పడలేదు.

ఎదుటి వాళ్ళ సంతోష పెట్టే గుణం ఎంత తక్కువ మందికి ఉంటుందో, ఎదుటి వారినేడిపించే గుణం కలిగిన మనుషులంత ఎక్కువగా ఉంటారు సమాజంలో అలా ఎదుటి వారినేడిపించి తద్వారా లభించే సంతోషంతో తృప్తి పడే వాళ్ళను శాడిస్టులంటారు అటువంటి శాడిస్టులు కూడా అతణ్ణేనాడూ తమ తృప్తి కోసం ఓ పావుగా వాడుకునే ప్రయత్నం చేయలేదు

ఆ ఆఫీస్‌లో పని చేసే మధుబాలకూ అందరిలానే సురేంద్రప్రవర్తన ఎంత ఆలోచించినా అర్థమయ్యేదికాదు

తన ప్రస్తుత వయసులో సగం వయసప్పటి నుంచీ వయసు పోరును తట్టు కుంటూనే ముప్పయ్యోవ పుట్టిన రోజీ మధ్యనే జరుపుకుంది మధుబాల.

ఉద్యోగంలో చేరి ఏడేళ్ళయినా మొదటి రెండు మూడు సంవత్సరాలు మాత్రమే ఆమె ఏడ్చింది. తనకీ జన్మకు పెళ్ళి యోగం లేదేమోనని కానీ గత నాలుగేళ్ళ నుంచీ మనసులో ఏం బాధపడుతోందో గానీ పైకి మాత్రం అందరితోనూ నవ్వుతూ ప్రవర్తించడం అలవాటు చేసుకొంది

తనంతట తానుగా అలవాటు చేసుకుందనే కంటే కూడా అవసరం ఆమెనలా అలవాటు చేసుకునేలా చేసిందంటే సబబుగా ఉంటుంది

ఉద్యోగంలో చేరిన కొత్తల్లో సన్నగా, లేడిపిల్లలా ఉండేదామె లేడి మాంసం పులికెంత ఇష్టమో - నాజూగ్గా ఉన్న లేడీస్ అంటే అంత పిచ్చి - అప్పట్లో సురేంద్ర స్థానంలో ఆ ఆఫీస్‌లో పనిచేసిన యాభై ఏళ్ళ నరసింహానికి.

దున్నపోతును చూస్తే అతడి దేహాన్ని చూడ నక్కర్లేదు ఎలుగుబంటి నెవరైనా చూసి ఉంటే అతడి మొహం ఎలా ఉంటుందో చెప్పేటందు కంతకంటే వివరణ అక్కర్లేదు

ఉద్యోగంలో చేరిన రెండు నెలలకు ఆఫీస్ టైమ్ అయి పోయాక ఆరుగంటలకు తన చేయి పట్టుకొన్న నరసింహాన్ని చూసి వణికి పోయింది మధుబాల ఆ వణుకు నుంచి ఆమె బయట పడకుండానే ఆఫీస్‌కు ఎటాచ్ చేసి ఉన్న రూమ్‌లోకి ఆమెను చేర్చాడు నరసింహం

రాకరాక వచ్చిన ఉద్యోగం పోతే- ముష్టెత్తుకోవడమో, వ్యభిచారం చేయడమో తప్ప మరో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఉన్న ఆడపిల్లల్లో మధుబాల కూడా ఒకర్తె ముష్టి వాడికి ముప్పై ఊళ్ళు తిరిగినా పిడికెడు ముద్ద దొరుకుతుందనే గ్యారంటీ లేని రోజులు కనుక, వ్యభిచారిగా గడపడం కంటే ఇదే నయమనే స్థితికి ఆమె మిదడు రావడంతో - ఆమెనో దార్ని వలసిన అవసరం నరసింహానికి కనబడలేదు

ఓ ఆడది పొరపాటున పవిట వదిలేసి మగాళ్ళ ముందో అరక్షణం నిలబడితే అందుకు విపరీతార్థాలు తీయని సమాజం సమాజమే కాదు కదా? అందుకే నరసింహం టూర్ మీద వెళ్ళినప్పుడల్లా తరచూ మధుబాలను తీసుకెళ్ళడం, ఆమెతో అతిథి గృహాల్లో పనిసాకుతో బస చేయడం - ఆ ఆఫీస్‌లో పని చేస్తున్న వ్యక్తులకు చర్చనీయాంశంగా ఉపయోగపడడంలో వింతేమీ లేదు

నరసింహాన్నేమైనా అంటే తమ కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్సును చీల్చి చెండాడుతాడు కనుక- మధుబాలను మృదు మధురంగా పలకరించడం, ఆమె దేహానికి కాళ్ళో, వేళ్ళో తగిలించడం, వెనకా ముందూ ద్వంద్వార్థాలనిచ్చే బూతు డైలాగులు వ్యంగ్యంగా విసరడం ఎంతో ప్రీతిగా ఉండేవి వాళ్ళందరికీ

వారి వ్యాఖ్యానాలు ప్రాణసంకటంగా ఉండే వామెకు మొదట్లో తనలో హాస్యాధారం చేసుకొని తనకు దగ్గరగా రాబోయిన ఓ కొలీగ్‌ను నరసింహం సహకారంతో ఆ ఆఫీస్‌కు దూరంగా తరిమి కొట్టాక ఆమెలో మొండి తనం ప్రవేశించింది

ఇప్పుడామే మగవాళ్ళను పిలిచి కవ్విస్తుంది అలా కవ్వింప బడి మనసులు పాడు చేసుకున్న ఒకరిద్దరు మగవాళ్ళనామె ఎక్కడ దెబ్బ కొట్టాలో అక్కడ కొట్టింది అదరిమిలా ఆమె జోలికి వెళితే దీపం దగ్గరకు చేరిన శలభాల గతే తమకూ పడుతుందని భావించిన మగవాళ్ళామెకు దూరంగా ఉండసాగారు.

తన అనుభవం తనకిచ్చిన ధైర్యంతో ఒకరిద్దరు మగ వాళ్ళను తన దగ్గరకు చేరే అవకాశాన్నివ్వక పోలేదు మధుబాల. అంత మాత్రాన ఆమె వారిని ప్రేమించిందనేందుకు వీలు లేదు అదో బిజినెస్ డీల్‌లాంటిదంతే!

మనసుచంపుకొని బ్రతుకుతున్న మధుబాల తనకు తెలియకుండానే సురేంద్ర వైపు ఆకర్షితురాలైంది కానీ మలిన మైన తన మనసు కతణ్ణి ఆకర్షించే యోగ్యతా, పరాధీన మైన శరీరానికతణ్ణి కోరే అర్హతా ఉన్నాయని ఆమేనాడూ అనుకోలేదు

* * * * *

"నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను మీ అభిప్రాయం తెలుసుకోవచ్చా?'

ఎన్నడూ ఆఫీసు విషయాలు తప్ప మరో మాట మాట్లాడని సురేంద్ర, ఆ రోజు ఏ ఉపోద్ఘాతమూ లేకుండా తననలా అడగడంలో, అణువిస్ఫోటనం జరిగినట్టుగా ఆమె మనసు కంపించి పోయింది ఆ

పరిస్థితి నుంచి తేరుకుని మామూలుగా కావడానికి చాలా సమయం పట్టిందామెకు.

"మీ మనసేమిటో తెలుసుకోకుండా నా కోరికను బహిర్గతం చేయడం మీకు కష్టం కలిగిస్తే చెప్పండి. ఈ విషయం ఇంతటితో మరచిపోదాం." అంటూ ఫైల్ అందుకున్నాడు సురేంద్ర.

ఆమె కంగారు పడింది.

'అహ... అసలు మీకు నాగురించి .... " అంటూ ఏదో చెప్పబోయింది.

చిరునవ్వు నవ్వి అన్నాడు సురేంద్ర– "గతం నాకు అనవసరం. మీశీలం ఎటువంటిదైనా ఫర్వాలేదు. మీ గురించి ఎన్నో కథలు విన్నాను వాటిలో నిజమున్నా కూడా వాటిని కథలుగానే భావించగల స్థైర్యం నాకుంది. మీరాలోచించాల్సిందల్లా ఒకే ఒక్క విషయం– నాతో పెళ్ళి మీ కిష్టమా? కాదా? అదేది అంతే!"

మధుబాల గుండె ఒక్కసారి ఆగి కొట్టుకొంది

సురేంద్ర పిచ్చివాడు కాదుకదా? అనిపించిందామెకు.

భార్య పరాయి మగాడితో మాట్లాడితేనే గింజుకుపోయే మహానుభావులున్న ఈ లోకంలో సురేంద్ర లాంటి వ్యక్తులుంటారంటే ఎందుకో నమ్మశక్యం గాలేదామెకు అయినా అతని మాటల ధోరణి చూస్తే తన గురించి అంతా తెలిసే తనను చేపట్టేందుకు సిద్ధమైనట్టున్నాడు. అతడాలోచించని శీలం గురించి తను బుర్ర పగుల గొట్టుకోవడం ఎందుకు?

"మరోసారి ఆలోచించు కోండి. నాకంటే సుమారు రెండు మూడేళ్ళు చిన్నవారే అయి ఉంటారు మీరు నా గురించి తెలిశాక కూడా మీరు నన్ను చేసుకుంటానంటే అభ్యంతర పరిచేందుకు నేను పిచ్చిదాన్ని కాను

నాగురించి మీరేం కథలు విన్నారో నాకు తెలియదు. కానీ ఆ కథల సారాంశం – నాకు శీలం లేదనే విషయమే అయితే మాత్రం నిజం' అంటూ అతడిగదిలోంచి లేచి వచ్చేసింది మదుబాల

* * * * *

సురేంద్ర, మధుబాలను పెళ్ళి చేసుకున్నాడనే వార్త – ఆ ఆఫీసులో సంచలనం కలిగించింది

[illegible]లంతా ఆరోజు మందు పార్టీ చేసుకున్నారు.

తమతో పని చేసే మగవాళ్ళకు గతంలో వీళ్ళెంత దూరంగా ఉండే అరుణ, అపర్ణ లిద్దరూ అదే విషయం గురించి పదే పదే మాట్లాడారు మగ కొలీగ్సుతో.

వాళ్ళిద్దరికీ పెళ్ళి కాలేదింకా. ఇద్దరికీ సురేంద్ర మీద ఆశ ఉండేది గతంలో. కానీ ఈ సంఘటనకు



తట్టుకో లేక ప్రత్యర్థులిద్దరూ ఏకమయ్యారు. కసిగా తిట్టుకున్నారతన్ని. మధుబాల లాంటి శీలం చెడిపోయిన ఆడదాన్ని చేసుకున్నాడంటే అందు కతడి గొప్పదనం కాక- అతడి లోనూ తత్సమాన మైన లొసుగేదో ఉండడమే నని తీర్మానించారు.

అటువంటి వాడు తమను చేసుకోనందుకు తామెంత అదృష్ట వంతులమో? అని ఒకరినొకరు అభినందించు కున్నారు.

మనసనేది లేనివాడు మనిషని పించుకోడు బాహాటంగా నిరసనను, హేళనను వ్యక్తం చేసిన ప్రతి వ్యక్తి మనసులో సురేంద్రను అభినందించక పోలేదు

ఆరాత్రి జరిగిన మందు పార్టీలో మగవాళ్ళంతా ఒక నిర్ణయం తీసుకున్నారు. తత్ఫలితంగా-

మర్నాడు బజర్ చప్పుడు నాలుగైదు సార్లు వినిపించాక గానీ ఆఫీస్ ప్యూన్, సురేంద్ర గదిలోకి వెళ్ళలేదు. వెళ్ళిన వాడు ఎప్పటిలా వినయంగా నిలబడక పోగా, నిర్లక్ష్యంగా చూశాడు సురేంద్ర వైపు.

అర్జంట్ మేటర్ డిస్కస్ చేసేందుకు పరమేశ్వర్రావుకు కబురు పెడితే అతడు పాంటు జేబుల్లో చేతులు పెట్టుకొని వీలైనంత ఠీవిగా ఛాంబర్‌లోకి ప్రవేశించి ఎదురుగా ఉన్న కుర్చీని చప్పుడయ్యేలా లాగి కూర్చుని రెక్లెస్‌గా చూశాడు సురేంద్రవైపు - 'ఏం డిస్కస్ చేస్తావో చెయ్యి? అన్నట్టుగా.

ఆరోజు మధ్యాహ్నం - కొద్ది రోజుల క్రితం సురేంద్రను చూసి సిగరెట్ ఆర్పేసిన చలపతి - రింగులు రింగులుగా పొగ వదులుతూ విలాసంగా చేతిలోని ఫైల్‌ను సురేంద్ర ఎదురుగా ఉన్న టేబిల్ మీద పడేసి-'నీకేం కావాలో చూసుకో' అన్నట్టుగా వెళ్ళి పోయాడు.

రెండ్రోజులు గడిచాక మధుబాలకు వినబడేలా మిత్రురాలితో అంది అరుణ- "బాగానే వల్లో వేసుకుందే!"

మధుబాలను ఓరకంట చూస్తూ అరుణతో

# ఆఖరి నిర్ణయం

అంది అపర్ణ-

"వేసుకోదూ మరీ? ఎంతకాలం ఊరి మీద బ్రతుకుతుంది? తన కంటూ ఓ తోడుండాలికదా?"

అరుణ మిత్రురాలి వైపు మెచ్చుకోలుగా చూస్తూ అంది- "బాగా చెప్పావ్! మనకైతే పెళ్ళిళ్ళవుతాయనే గ్యారంటీ ఉంది గానీ పాపం ఈవిడ కాగ్యారంటీ లేదు కదా?"

మరొకప్పుడైతే మధుబాల వాళ్ళిద్దర్నీ చీల్చి చెండాడేది

కానీ తనకు సురేంద్రతో పెళ్ళయ్యాక ఆఫీస్ వాతావరణమే మారి పోయింది.

వాళ్ళిద్దరే కాకుండా- మిగిలిన స్టాఫ్ కూడా తనపట్ల ఎలా ప్రవర్తిస్తున్నారో సురేంద్ర చెప్పినపుడు - తమ పెళ్ళి ఎక్కడికి దారితీస్తుందో అర్థం కాలేదామెకు. అందుకే ఆలోచిస్తూ ఉండి పోయింది చాలా సేపు

నెలరోజుల తర్వాత రాత్రి పదకొండు గంటలకు తూలుతూ ఇంటి కొచ్చిన సురేంద్రను చూడగానే అర్థమైందామెకు- అతడెక్కడ్నుంచి వస్తున్నాడో.

కాఫీ, టీలు తాగడం కూడా అలవాటు లేని వ్యక్తి బార్ కెళ్ళి త్రాగి రావడం అలవాటు చేసుకున్నాడంటే తనిక ఉపేక్షించి లాభం లేదు.

* * * * *

మర్నాడు ఇంటి కొచ్చిన సురేంద్రకు డ్రెస్సింగ్ టేబిల్ మీద మడత పెట్ట బడిన కాగితం కనిపించింది.

చేతిలో ఉన్న సిగరెట్‌ను నోట్లో ఉంచి ఆ కాగితాన్ని విప్పాడు సురేంద్ర.

"నా ప్రియాతి ప్రియమైన మీ కిలా వ్రాయ వలసి వస్తుందని నేనేనాడూ అనుకోలేదు.

ఈ జన్మకు నాకు పెళ్ళవుతుందనే నమ్మకం కోల్పోయిన సమయంలో మీలాంటి ఉత్తమ వ్యక్తికి భార్యనయ్యే అవకాశం నాకు లభిస్తుందని కలలో నైనా ఊహించలేదు నేను.

కానీ నాఊహకు భిన్నంగా, జన్మ జన్మలకూ గుర్తుండి పోయేలా మీతో నా వివాహం జరిగింది. సమాజాన్ని లెక్క చేయకుండా నన్ను మీదాన్ని చేసుకున్న మిమ్మల్ని సమాజం ఇంత ఘోరంగా సత్కరిస్తుందనుకోలేదు.

ఒకప్పుడెంతో గౌరవించిన వ్యక్తులే మిమ్మల్ని పురుగుకంటే హీనంగా చూస్తుంటే, భరించగలిగే శక్తిని సంపాదించుకునేందుకు కొత్త అలవాట్లు చేసుకున్నారు మీరు.

ఇంత వ్యథను భరిస్తూ కూడా నన్నొక్క మాటనని మీ వ్యక్తిత్వం ముందు నేనెంతో అల్పురాలిననే భావన నన్ను నిలకడగా ఉండనీయడం లేదు.

శీలం చెడిన ఆడదాని జీవితం బాగుపరచే ప్రయత్నం చేయని సమాజం - ఒక వ్యక్తికా అవకాశం లభిస్తే అభినందించక పోగా ఏదో చేయరాని తప్పు చేసినట్లు అభిశంసిస్తోందనే విషయం తలచుకుంటే చుట్టూ ఉన్న మనుషుల మీద నాకెంతో అసహ్యం కలుగుతోంది.

నన్ను పాడు చేసిన నరసింహాన్నేమీ చేయలేని సమాజం, నా జీవితానికి వెలుగు నిచ్చి నాకో నీడ చూపించిన మీ ఉనికినే సహించలేక పోతోందనే ఊహను సహించ గలిగే శక్తి నాకు లేదు.

నాతో జరిగిన పెళ్ళినో పీడ కలగా భావించి నన్ను మరచిపోయేందుకు ప్రయత్నించండి.

అన్ని విధాలా సమాజం చేత ఆమోదించబడిన అనుకూలవతి యైన వ్యక్తి మీకు భార్యగా లభించాలని మనసారా కోరుకుంటూ,

–నిన్నటి మీ మధుబాల'

చేష్టలు దక్కి నిలబడి పోయిన సురేంద్ర, అక్షణాన్నే ఒక నిర్ణయం తీసుకున్నాడు- ఈ లోకంలో మధుబాల ఎక్కడున్నా వెదికి పట్టుకొని ఆమెతోనే మిగిలిన జీవితం గడపాలని □




